క్లుప్తంగా

భాస్వరం వినియోగంపై రైతులకు అవగాహన

బోనకల్: బోనకల్‌లో శనివారం భాస్వరం (పీఎస్‌బీ) ఎరువును కరిగించే జీవన ఎరువుల వాడకం ప్రయోజనాల గురించి వ్యవసాయ అధికారులు ఏఓ శరత్‌బాబు, ఏఈఓ సాదన రైతులకు వివరించారు. ఎకరానికి 2 కేజీల పీఎస్‌బీ ఎరువులు 200 కేజీల పశువుల ఎరువుతో లేదా వానపాముల ఎరువుతో కలిపి పొలంలో చల్లాలన్నారు. 100 మిల్లీ లీటర్ల నీటితో 100 గ్రాముల బెల్లం కలిపి 200 గ్రాముల జీవన ఎరువుతో విత్తన శుద్ధి చేస్తే ఎకరానికి సరిపడా విత్తనాలు శుద్ధి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన..

మధిర: తపాలా శాఖలోని అన్ని పోస్టల్ పథకాలకు వడ్డీ రేట్లు గణనీయంగా పెరిగాయని మధిర పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బాజీ బాబు తెలిపారు. శనివారం మధిర పోస్ట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ పథకాలపై ప్రజలకు, ఏజెంట్లకు అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఓమారు పోస్టుఆఫీస్ వడ్డీ రేట్లు సవరిస్తూ ఉంటుందని, దీనిలో భాగంగా జనవరి1, 2023 నుంచి పోస్ట్ ఆఫీస్ వడ్డీ రేట్లు భారీగా పెంచిందన్నారు. ఈ రేట్లు మార్చి 2023 వరక వర్తిస్తాయన్నారు.

ఎయిడ్స్‌పై వలంటీర్లకు శిక్షణ

కల్లూరు: కల్లూరులో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో యువతకు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ తదితర వ్యాధుల గురించి వివరించారు. హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అక్రమ సంబంధాలు పెట్టుకోవద్దన్నారు. సుఖ వ్యాధులు వచ్చిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్ష క్లీనిక్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాన్నారు. హెచ్‌ఐవీ వచ్చిన వారు ఉచితంగా మందులు పొంది సంపూర్ణ ఆరోగ్యం పొదాలని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు హెల్త్‌కార్డులు

బోనకల్: మండలంలోని 180 మంది ఆటో డ్రైవర్లకు బత్తినేనిఛారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ట్రస్టు సభ్యుడు తూము రోషన్‌కుమార్ సహకారంతో మేఘన శ్రీ హాస్పటల్ వారి హెల్త్‌కార్డులను ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ టి.పవన్‌కుమార్‌తో కలిసి శనివారం అందజేశారు. ఆటోవాలల సౌకర్యార్థం ట్రస్టు సౌజన్యంతో రూ.499 విలువ చేసే హెల్త్ కార్డును ఉచితంగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో గురుకుల విద్యాలయాల తెలంగాణ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ప్రిన్సిపాల్ తూడి శ్రీనివాసరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, ఉషారాణి, జమున, సుమలత, విజయ్‌కుమారి, శ్రీనివాస రెడ్డి, రవికుమార్, నర్సింహారావు, సతీష్, అనీల్, రాము, ధర్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ముదిగొండ: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతతో కూడిన జీవనం పొందవచ్చని యోగా గురువు రమేష్ గురూజీ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం యోగాసనాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే యోగసనాలను చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీడీపీఓకు సన్మానం

ముదిగొండ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ సీడీపీఓ అవార్డు అందుకున్న ఐసీడీఎస్ ఖమ్మం రూరల్ ప్రాజెక్ట్ సీడీపీఓ సరస్వతిని సూపర్‌వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముదిగొండ మండలంలోని యడవల్లి రెండో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సన్మానించారు.

ఎంపీడీఓకు సన్మానం

ఏన్కూరు: గణతంత్రదినోత్సవ వేడుకలలో భాగంగా ఉత్తమ ఎంపీడీఓగా ఎన్నికైన ఏన్కూరు ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌ను సిబ్బంది శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, మండల ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఎంపీడీఓను శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు.

'గుడ్ల' సేవలు ఎనలేనివి

ఏన్కూరు: మండలంలోని ఆరికాయలపాడు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ గుడ్ల వెంకటేశ్వరరావు పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఈ నెల 27న హైదరాబాద్ రవీంద్రభారతిలో న్యూలైటీయాలాజికల్ యూనివర్సిటి వార్షికోత్సం సందర్భంగా పౌండర్ జోసెఫ్, మేయర్ జక్కా వెంకటరెడ్డి చేతులు మీదుగా గోల్డ్‌మెడల్, కీర్తిపురస్కార్ అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో నాగమణి, సందీప్, ఫక్రుద్దీన్, రాములు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం గోపీనాథ్

- వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో రాణించిన గోపీనాథ్
- పార్లమెంట్‌లో ప్రసంగించిన ఎర్రుపాలెం వాసి



అప్పటి డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఉమేష్ సిన్హా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గోపీనాథ్ (ఫైల్)

SUNDAY SPECIAL



గోపీనాథ్ గెలుచుకున్న అవార్డులు

ఎర్రుపాలెం: నిరుపేద కుటుంబంలో పుట్టి తనకున్న ప్రతిభను చూపుతూ.. వ్యసరచన, వక్తృత్వ పోటీల్లో బాగా రాణించి తనదైన ముద్ర వేసుకున్నాడు మన గోపీనాథ్. చెన్నంశెట్టి గోపీనాథ్ ఎర్రుపాలెంకు చెందిన చెన్నంశెట్టి రామారావు, లక్ష్మీనర్సమ్మ దంపతులకు జన్మించాడు. వీరు ఇరువురు నిరక్ష్యరాసులే. వీరి తల్లిదండ్రులు అతనని చాలా కష్టపడి చదివించారు. చిన్ననాటి నుంచి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో బాగా రాణించి పాఠశాల స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఎన్నో బహుమతులు సొంతం చేసుకున్నాడు. పుట్టినూరుకి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చాడు. ఈయన ప్రాథమిక విద్య అంతా ప్రభుత్వ పాఠశాలలే. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రం తంజావూరు పట్టణంలోని శాస్త్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు.

పార్లమెంట్‌లో ఆకట్టుకున్న గోపీనాథ్ ప్రసంగం..

న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో జిల్లా నుంచి ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌గా చెన్నంశెట్టి గోపీనాథ్ 'భారత రత్న మదన్‌మోహన్ మాలవీయ జీవిత చరిత్ర'గూర్చి చేసిన ప్రసంగం పలువురిని ఆకట్టుకుంది. ఈ ప్రాంతంలో టీవీల్లో, సోషల్ మీడియాల్లో ప్రసారమైన ప్రసంగం వీడియోలు బాగా వైరల్ అయ్యాయి.

- 2018 జనవరి 25న నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అప్పటి నేషనల్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఉమేష్ సిన్హా చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు.
- 2019 ఫిబ్రవరి 14న టాటా బిల్డింగ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో లక్షలాది మంది విద్యార్థులతో గ్లోబల్ వార్మింగ్ అనే అంశంపై జాతీయస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించగా అందులో గోపినాథ్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ చేతుల మీదుగా జాతీయస్థాయి అవార్డును గెలుచుకున్నాడు.
- 2020 జనవరి 17న మహబూబ్‌నగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రక్తదానం ప్రాముఖ్యత అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, సీపీ తఫ్సీర్ ఇక్బాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.
- 2020లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన తానా మదర్స్ డే కాంపిటీషన్‌లో, ఖమ్మంలో వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై జిజ్ఞాస ఇంటర్‌ఫేస్ నిర్వహించిన పోటీల్లో ప్రపంచ డయోవర్సిటీ అంశంపై వ్యాసరచన పోటీల్లో విజేతగా నిలిచి నగదు బహుమతులు సాధించాడు.
- 2021 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.11వేల నగదు బహుమతిని గెలుచుకున్నాడు.
- 2022 ఫిబ్రవరిలో నేషనల్ సైన్స్‌డే సందర్భంగా ఆలిండియా గీతం యూనివర్సిటీ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. ఇలా పలు జాతీయ, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో గోపినాథ్ బహుమతులు సాధించి ఎర్రుపాలెంకు మంచి పేరు తెచ్చాడు.

ఐఏఎస్ సృష్టి జయంత్ దేశ్‌ముఖ్‌ని ఆదర్శంగా తీసుకుంటా



మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సృష్టి జయంత్ దేశ్‌ముఖ్‌ని ఆదర్శంగా తీసుకున్నా.. బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ కోర్సు చేస్తూ మొదటి ప్రయత్నంలో ఐఏఎస్ సాధించి ప్రజలకు సేవలందిస్తున్న ఐఏఎస్ సృష్టి జయంత్ దేశ్‌ముఖ్‌ని మార్గద సివిల్స్ సర్వీసెస్ లక్ష్యాన్ని పెట్టుకుని అది సాధించే దిశగా అడుగులు వేస్తున్నా.

– చెన్నంశెట్టి గోపీనాథ్, ఎర్రుపాలెం

పేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా/కొణిజర్ల: ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. వైరా, కొణిజర్ల మండలాలకు సంబంధించిన పలువురి లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆపదలో ఉన్న ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎంపీపీ పావని, ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు చిరంజీవి, శ్రీనివాసరావు, బ్రహ్మం, రత్నం, మాధవరావు, మోహన్‌రావు, బాలాజీ, రామారావు, బాబూలాల్, చిన్నపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా..

వైరా: కోందడ రామాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. శనివారం వైరా శ్రీ కోదండ రామాలయం పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం ఈఓ ప్రసాద్, ఎండోమెంట్ ఆఫీసర్ సమత అధ్యక్షతన నిర్వహించారు. చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు, పాలకమండలి సభ్యులచే వారు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, వనమా విశ్వేశ్వరరావు, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, రత్నం, కృష్ణార్జునరావు, మురళీకృష్ణ, కృష్ణమూర్తి, మధు, సునీత, అర్చకులు సతీష్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు



సత్తుపల్లిరూరల్: రేజర్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో సూర్యనమస్కారం చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్/ఎర్రుపాలెం/తల్లాడ: సత్తుపల్లి మండలంలోని రేజర్ల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి ఆధ్వర్యంలో, ఎర్రుపాలెంలోని జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో, తల్లాడ మండలంలోని తల్లాడ హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయంలో, రామలింగేశ్వర స్వామి, రేజర్ల ఆంజనేయం స్వామి, కలకొడిమ కోదండ రామాలయం, శివాలయం, కుర్నవల్లి అయ్యప్ప స్వామి దేవాలయం, వేంకటాచలపతి ఆలయం, నారాయణపురం కోదండ రామాలయంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆరాధనాధులు, సేవా కాలం పూర్తైన తర్వాత భక్తులందరూ శ్రద్ధతోటి సూర్య నమస్కారాలు ఆచరించి, గోపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రథ సప్తమి పర్వదిన ప్రాధాన్యతను ప్రధాన అర్చకులు భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: పేదింటి ఆడబిడ్డలక వివాహాలకు భారం కాకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. దేశంలో ఏ ప్రభుత్వం అమలుచేయని సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమౌతున్న సందర్భంగా అంగన్‌వాడీ, గ్రామదీపికలు, గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ హైమావతి, ఆత్మకమిటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

అడవిమల్లేలలో ఆలయ ప్రతిష్ఠ..

పెనుబల్లి: మండలంలోని అడవిమల్లేలలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ శనివారం వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేసి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై, టీటీడీ నిధుల నుంచి రూ.10 లక్షల రూపాయలు నిర్మాణానికి అందజేయడం పట్ల ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమానికి డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కోటూరి మానవతారాయ్‌తో పాటు మండల వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్ ఏసీడీ చార్జీలను రద్దు చేయాలి



ఏఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

వేంసూరు/పెనుబల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై అదనంగా వేస్తున్న ఏసీడీ చార్జీలను వెంటనే రద్దు చేయాలని వేంసూరులోని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, పెనుబల్లి మండలంలోని బ్రహ్మళకుంటలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఏసీడీ చార్జీలకు వ్యతిరేకంగా వేంసూరు ఏఈ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.150 వచ్చే విద్యుత్ బిల్లు ఏసీడీ పుణ్యమా అని రూ.1,500 వస్తుందన్నారు. కూలీ పనులు చేసుకునే సామాన్యులు ఇంత బిల్లు ఎలా కట్టాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, మట్టా ప్రసాద్, రఘునాధరెడ్డి, లచ్చిరాజు, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాస్, నాని, రైతులు, సీపీఎం జిల్లా కార్యదర్శి చలమాల విఠల్‌రావు, నల్లమోతుల కృష్ణ, రాజినేని మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా విజ్ఞానోత్సవ్




మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి రవిబాబు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విజ్ఞానోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను, పాటల పోటీలను నిర్వహించగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి కె.రవిబాబు మాట్లాడారు. కళాశాల అభివృద్ధిలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

తల్లాడ: మండలంలోని కలకొడిమ ఆలయ అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐ దిరిశాల అక్షయ్ రూ.3 లక్షలు విరాళం అందించారు. శనివారం కలకొడిమ ఆలయంలో ఆయన రథసప్తమి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని విరాళం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ దిరిశాల దాసురావు, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల అక్షయ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్లీడర్ కృష్ణారావు, శ్రీలక్ష్మి, హసన్, కుటుంబరావు, సూరయ్య, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల కోసం పోరాడుతాం



మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత వీరభద్రం

కారేపల్లి: గిరిజనుల హక్కులకోసం నిరంతరం పోరాడుతామని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం కారేపల్లిలో గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఉసిరికాయపల్లి సర్పంచ్ బాణోతు బన్సిలాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన హక్కుల కోసం పేదల పోడు హక్కులు, గిరిజన ఆవాసాల సమగ్రాభివృద్ధికి నిరంతర పోరాటాలు చేస్తుంది ఒక్క తెలంగాణ గిరిజన సంఘం మాత్రమే అన్నారు. ఫిబ్రవరిలో జరగనున్న తెలంగాణ గిరిజన సంఘం జిల్లా మహాసభలకు కారేపల్లి మండల కేంద్రం వేదిక కానుందన్నారు. జిల్లా మహాసభల విజయవంతానికి 29న ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా రామారావు, నాయకులు చందర్, పుల్లయ్య, కూమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి రెండు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో ఎన్టీఆర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను వచ్చే నెల 5 నుండి 7వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంట్రీలను వచ్చే నెల 4వ తేదీ కల్లా ఎం.సాంబ సెల్‌ఫోన్ నంబర్ 6309602668కు పంపించాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15,116, రూ.12,116, రూ.8,116, చతుర్థ, పంచమి బహుమతులుగా రూ.6,116, రూ.5116లను అందజేయడం జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు

కారేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని వైరా నియోజకవర్గ టీపీసీసీ సభ్యుడు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం కారేపల్లి, భాగ్యనగర్‌తండా గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిర్వహిస్తున్న జోడో యాత్రను ప్రజలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు టోనీ వీరప్రతాప్, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, భీముడు, తాజుద్దీన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

మధిర: బోడెపూడి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెల నాలుగో శనివారం స్థానిక బోడెపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరుగుతున్న ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరం ద్వారా షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను రూ.100లకు అందించారు. 140 మంది రోగులు వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో రజిత, శివన్నారాయణ, అబ్దుల్, నరసింహారావు, మురళి, రాధాకృష్ణ, మీరాఖాన్, శేషగిరిరావు, సైదులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉండాలి

ఏన్కూరు: ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉండాలని ఆయుర్వేద వైద్యుడు శంకర్ కోరారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆడపిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ అరుణ, పాఠశాల ప్రత్యేకాధికారి ఉషారాణి, ఎఎన్‌ఎం వినోద్, శైలజ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

పెనుబల్లి: మండలంలో సరిగ్గా పారిశుద్ధ్యం నిర్వహించక దోమలు విపరీతంగా స్వైర విహారం చేస్తున్నాయని, వాటికి మందులు పిచికారీ చేసి నివారణ చర్యలు చేపట్టాలంటూ సీపీఎం మండల కమిటి ఆధ్వర్యంలో ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మికి శనివారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి తిరుపతిరావు, అరుణ్‌ప్రతాప్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఆలయ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందిస్తున్న దేవాదాయశాఖ అధికారులు



పల్లిపాడు శివాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు ఆలయ చైర్మన్ చింతనిప్పు రాంబాబుతో పాటు చుండూరు రవి, కొరివి పద్మ, ధూళిశెట్టి గోవిందరావు, తడిమళ్ల నాగేశ్వరరావు, మట్టూరి శ్రీనివాస్‌లు ధర్మకర్తలుగా ఎండోమెంటల్ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓలు శ్రీకాంత్, ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీపురం, ముసలిమడుగు సర్పంచ్‌లు అమ్మికరామారావు, చింతనిప్పు సుధారాణి, ఉపసర్పంచ్ రామకృష్ణ, కొరివి కొండ, సుబ్బిరెడ్డి, వెంకన్న, రాజు, కృష్ణారావు, స్వామి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శివాలయం పాలకమండలి..

కొణిజర్ల: పల్లిపాడులోని శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయం నూతన పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎనగంటి కృష్ణ, సభ్యులు ఉబ్బనపల్లి సాంబశివరావు, భూక్యా శ్రీనివాసరావు, కమ్మగంటి గోపాలరావు, ఓర్సు రాధాకృష్ణ, తెల్లబోయిన మాధవి, జాలాది సత్యవతిలచే ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ సమత ప్రమాణ స్వీకారం చేయించారు. పాలక మండలి రెండో పర్యాయం ప్రమాణ స్వీకారం నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమాన్ని ఈఓలు ప్రసాద్, శ్రీకాంత్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఘాలి ముక్తేశ్వర శర్మ, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవాలయ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు..



వెంకటేశ్వరరావు

కల్లూరు: కల్లూరు శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయం చైర్మన్‌గా కల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి గుర్రం వెంకటేశ్వర రావు (శ్రీను) ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం సాయంత్రం దేవాదయశాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రం అందింది. సభ్యులుగా బొడ్డు కృష్ణ, మల్లాది బసవయ్య, అజ్మీరా జమలయ్య, ఎనుముల రాంబాబు, డి.అలివేలు, ఇల్లూరి దుర్గలు ఎంపికయ్యారు.

కల్యాణ మండపాల నిర్వాహకులకు నోటీసులు



నోటీస్ అందిస్తున్న ఫైర్ ఆఫీసర్ మాధవరావు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని కల్యాణ మండపాల నిర్వాహకులకు శనివారం మున్సిపాలిటీ, అగ్నిమాపక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జీ ఫైర్ అధికారి మాధవరావు, మున్సిపాలిటీలోని 8 కల్యాణ మండపాల నిర్వాహకులు నోటీసులు అందజేశారు. ప్రతీ కల్యాణ మండపంలో కార్బన్ సిలెండర్లతో పాటు సెఫ్టీ మెజర్‌మెంట్‌కు అవసరమైన పరికరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రక్షణ చర్యలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. మండపాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిత, టౌన్ ప్లానింగ్ అధికారి భాస్కర్ ఉన్నారు.


నిరుపేదలకు అన్నదానం

మధిర: స్థానిక శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కుడుముల మహేశ్వరరెడ్డి, విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో నిరుపేదలకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు గొండేల ముత్తయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కటకం నరసింహారావు, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీతాదేవి, ఉమామణిందర్ రెడ్డి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గీతా మందిరంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గీతాజ్ఞానమందిరంలో గల శ్రీ పార్థసారధిస్వామి ఆలయంలో శనివారం కంచర్ల సాంబశివరావు, నడిపల్లి రామారావుల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ముందుగా ఆలయంలో రథసప్తమి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, వెంకటనర్సయ్య, పురుషోత్తమరావు, లీలా కృష్ణ, రాఘవయ్య, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం



తల్లాడ: దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందిస్తున్న ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, సర్పంచ్ సామ్రాజ్యం

తల్లాడ: ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని ఎంపీడీఓ బి.రవీంద్రరెడ్డి అన్నారు. తల్లాడ మండలం మల్లారం గ్రామంలో శనివారం ప్రజల వద్దకు ఆర్టీసీ, దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుగ్గిదేవర సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీఓ మాట్లాడారు. ఆర్టీసీ సంస్థ ప్రజలకు అనేక రాయితీలను అందిస్తూ.. వారిని క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తుందన్నారు. ఆర్టీసీ రిజర్వేషన్ టికెట్‌తోపాటు మరో రూ.300 అదనంగా చెల్లిస్తే తిరుపతి దర్శనం టికెట్ కూడా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపో టీఐ అలీ, ఎంపీఓ కె.శ్రీదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం పాల్గొని ఆర్టీసీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తూము సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.